






విక్టరీ సింబల్ చూపుతున్న టీడీపీ అభిమానులు



జనచంద్రం

- దోపిడీకి కేరాఫ్ వైసీపీ ఎమ్మెల్యేలు
- జగన్ పాలనలో ఒక్క రోడ్డు కూడా వేయలేదు
- రాబోయేది మన ప్రభుత్వమే
- మంత్రాలయంలో వలసలు ఆపేందుకు ప్రత్యేక ప్రణాళిక
- కౌతాళంలో వంద పడకల ఆసుపత్రిని నిర్మిస్తా
- గూడూరు, కోడుమూరులో ఎస్ఎస్ ట్యాంకులు నిర్మిస్తా
- డిగ్రీ కళాశాలను మంజూరు చేయిస్తా
- కౌతాళం, గూడూరు ప్రజాగళంలో చంద్రబాబు



చంద్రబాబుతో తిక్కారెడ్డి, నాగరాజు



నాగలితో బాబు





కర్నూలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి)/కౌతాళం/గూడూరు:

కౌతాళం జనంతో కిక్కిరిసింది.. గూడూరులో తెలుగు తమ్ముళ్లు కదం తొక్కారు.. చంద్రబాబు రాకతో టీడీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం... మొత్తం మీద టీడీపీ అధినేత చంద్రబాబు రాకతో కౌతాళం, గూడూరు 'ప్రజాగళం' సభలు జనంతో కళకళలాడాయి. ఆదివారం ప్రజాగళం యాత్రలో భాగంగా కౌతాళం, గూడూరులో జరిగిన బారీ బహిరంగ సభల్లో చంద్రబాబు మాట్లాడారు. ఆయా సభలకు పల్లెల నుంచి జనం వెల్లువలా తరలి వచ్చారు. ఎన్నికల్లో చంద్రబాబుకు మద్దతుగా మేము సైతం అంటూ వృద్ధులు, మహిళలు, రైతులు, యువతరం ఇలా అన్ని వర్గాల ప్రజలు దండుకట్టి జెండా పట్టి ప్రజాగళమై తరలివచ్చారు. ఇక ఉప్పొంగిన జనం ఉత్సాహాన్ని చూసి చంద్రబాబు సీఎం జగన్ ప్రభుత్వ వైఫల్యాలపై నిప్పులు చెరిగారు. అదే క్రమంలో జూన్ 4 తర్వాత ప్రమాణస్వీకారం చేయబోయే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి జనపాలన ప్రభుత్వంపై ప్రజా ప్రభుత్వం వచ్చాక చేయబోయే సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. జగన్ ప్రభుత్వాన్ని తుక్కుతుక్కుగా ఓడించి సైకోను ఇంటికి పంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ...'జగన్ సభలు జనం లేక వెలవెలబోతున్నాయి.. గెలుపు టీడీపీదే అని అర్థమైపోతుంది. మీ ఉత్సాహం చూస్తుంటే.. ఫ్యాన్ పార్టీని తుక్కుతుక్కుగా ఓడిస్తారు.. కర్నూలు పార్లమెంటు సహా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మనమే గెలుస్తున్నాం..' అంటూ టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని ప్రారంభించారు. అదే సమయంలో ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు వై. సాయిప్రసాద్ రెడ్డి, బాలనాగిరెడ్డిలపై విరుచుకుపడ్డారు. వైసీపీ నుంచి గెలిచిన ఆ ఎమ్మెల్యేలు దోపిడీదారులన్నారు. ఎమ్మెల్యే బ్రదర్స్ దోపిడీకి కేరాఫ్‌గా నిలిచారన్నారు. ఆ ఎమ్మెల్యేల దోపిడీలు హద్దులు మీరాయని, ఇసుక మాఫియాను పెంచి పోషిస్తూ తుంగభద్ర ఇసుకను గుల్ల చేస్తున్నారంటూ చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

'వలసల నివారణకు కార్యాచరణ'

కౌతాళంలో జరిగిన ప్రజాగళం సభలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్. రాఘవేంద్రరెడ్డిలతో కలిసి చంద్రబాబు మాట్లాడారు. మూడు సార్లు మంత్రాలయం ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డిని గెలిపిస్తే.. ఒక్క రోడ్డయినా వేశాడా..? ఒక్కరికైనా ఉద్యోగం ఇప్పించాడా..? ఒక్క అభివృద్ధి పనైనా చేశాడా? అంటూ చంద్రబాబు నిలదీశాడు. రాబోయే మన ప్రభుత్వంలో సాగు నీటికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో వలసల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. గురు రాఘవేంద్ర ప్రాజెక్టు లిఫ్టులను మరమ్మతులు చేయిస్తాం.. ఆర్డీఎస్ కుడి కాలువను పనులు మొదలు పెట్టి పూర్తి చేస్తామని చంద్రబాబు చెప్పారు. కౌతాళంలో వంద పడకల ఆసుపత్రిని నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. నీరు, విద్య, ఆరోగ్యం, ఉపాధిని పెంపొందించి పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పని చేస్తామన్నారు. కర్నూలు ఎంపీగా కురువ సామాజిక వర్గానికి చెందిన నాగరాజుకు, మంత్రాలయం ఎమ్మెల్యేగా బోయ సామాజిక వర్గానికి చెందిన రాఘవేంద్రరెడ్డికి, ఆదోనిలో అదే వర్గానికి చెందిన పార్థసారథికి, ఆలూరులో లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన వీరభద్రగౌడ్‌కు, కోడుమూరు ఎస్సీ మాదిగ వర్గానికి చెందిన బొగ్గుల దస్తగిరికి, పత్తికొండలో ఈడిగ సామాజిక వర్గానికి చెందిన కేఈ శ్యాంబాబుకు, కర్నూలులో ఆర్యవైశ్య వర్గానికి చెందిన టీజీ భరత్‌కు, నంద్యాలలో ఫరూక్‌కు టికెట్లు ఇచ్చామన్నారు. ఇది సామాజిక న్యాయం అంటే అని వివరించారు. మన ప్రభుత్వం రాగానే సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి ఇక్కడే ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.



చంద్రబాబుతో కలిసి హెలికాప్టర్‌లో నాగరాజు



కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుకు టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబుతో కలిసి హెలికాప్టర్‌లో ప్రయాణించే అవకాశం లభించింది. ప్రజాగళం యాత్రలో భాగంగా ఆదివారం సాయంత్రం కౌతాళంలో జరిగిన బారీ బహిరంగ సభలో చంద్రబాబుతో కలిసి బస్తిపాటి నాగరాజు కూడా పాల్గొన్నారు. అక్కడి నుంచి గూడూరు ప్రజాగళం సభకు చంద్రబాబు బయలుదేరాల్సి ఉంది. అదే సభకు ఎంపీ అభ్యర్థి నాగరాజు కూడా హాజరు కావాల్సి ఉంది. వాహనంలో రావాలంటే.. చేరుకోవడం కష్టం. దీంతో చంద్రబాబు తన హెలికాప్టర్‌లోనే నాగరాజుతో కలిసి కౌతాళం నుంచి గూడూరుకు బయలుదేరారు. ఈ సందర్భంగా కర్నూలు పార్లమెంటు పరిధిలో నెలకొన్న వివిధ సమస్యలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆర్డీఎస్, వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులు పూర్తి చేయాలని చంద్రబాబును కోరారు.

కోడుమూరులో ఎస్ఎస్ ట్యాంకుల నిర్మాణం

గూడూరు భారీ బహిరంగ సభలో టీడీపీ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరితో కలిసి చంద్రబాబు ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కోడుమూరు, గూడూరు పట్టణాల్లో ఎస్ఎస్ ట్యాంకులు నిర్మించి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. అదే క్రమంలో యువతరానికి ఉపాధి చూపే స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. కోడుమూరు నియోజకవర్గం అత్యంత వెనుకబడి ఉందని, ఎమ్మెల్యేగా బొగ్గుల దస్తగిరిని గెలిపించండి.. నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించే బాధ్యత తీసుకుంటానని అన్నారు. నియోజకవర్గం పక్కనే తుంగభద్ర ఉంది. వైసీపీ నాయకులు ఇసుక, మట్టి దోపిడీ చేస్తున్నారు. వాళ్లకు దోపిడీపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదంటూ ఘాటుగా స్పందించారు. గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మించి ఈ ప్రాంతానికి సాగు, తాగునీటి సమస్య తీరుస్తానని హామీ ఇచ్చారు. అదే క్రమంలో గురు రాఘవేంద్ర, పులకుర్తి ఎత్తిపోతల పథకాలకు మరమ్మతు చేయించి నిర్వహణకు నిధులు ఇస్తామని చెప్పారు. అలాగే కోడుమూరు, గూడూరులో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేస్తామని, యువతకు ఉన్నత విద్య అందించే బాధ్యత టీడీపీ తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.

గూడూరులోనే రాత్రి బస: ప్రజాగళం సభల్లో భాగంగా ఆదివారం రాత్రి గూడూరులోనే చంద్రబాబు బస చేశారు. సోమవారం నందికొట్కూరు, డోన్ పట్టణాల్లో జరిగే జరిగే ప్రజాగళం సభల్లో చంద్రబాబు పాల్గొంటారు.



గూడూరులో మాట్లాడుతున్న చంద్రబాబు.. పక్కనే దస్తగిరి, నాగరాజు



గూడూరు సభకు భారీగా తరలివచ్చిన ప్రజలు



కౌతాళంలో మాట్లాడుతున్న చంద్రబాబు... పక్కనే నాగరాజు, రాఘవేంద్ర రెడ్డి

నేడు డోన్, నందికొట్కూరుకు చంద్రబాబు



చంద్రబాబు పర్యటనపై చర్చిస్తున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి

డోన్, నందికొట్కూరు, ఏప్రిల్, 28: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సోమవారం డోన్, నందికొట్కూరులో పర్యటించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు పట్టణంలోని వెంకటనాయునిపల్లె రహదారిలో ఏర్పాటు చేసిన మైదానంలో హెలికాప్టర్‌లో ల్యాండ్ అవుతారు. అక్కడి నుంచి వాహనంలో వచ్చి గాంధీ సర్కిల్‌లో జరిగే ప్రజాగళం బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5.10 గంటలకు నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి పటేల్ సెంటర్‌కు రోడ్డు షో నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు ప్రజలను ఉద్దేశించి బహిరంగ సభలో మాట్లాడతారు. 7.50 గంటలకు మాండ్ర శివానందరెడ్డి నివాసానికి చేరుకొని రాత్రి బస చేస్తారు.

తెలంగాణ మద్యం కేసులో మరో ట్విస్టు

ఎఫ్ఐఆర్‌లో ఇద్దరు వైసీపీ నాయకుల పేర్లు ?

ఆత్మకూరు, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ నుంచి ఆత్మకూరుకు మద్యాన్ని అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన కేసులో మరో ట్విస్టు వెలుగుచూసింది. శనివారం తెల్లవారుజామున తెలంగాణ నుంచి ఓ వాహనంలో భారీగా మద్యాన్ని ఆత్మకూరు తీసుకొస్తుండగా కొత్తపల్లి పోలీసులు పక్కా సమాచారంతో దాడి చేసి పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో రూ.5.6 లక్షల విలువ గల 91కేసుల (4368 క్వార్టర్లు) మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు నలుగురి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తొలుత వెల్లడించారు. అయితే ఈ వ్యవహారంలో కొత్తపల్లి మాజీ జడ్పీటీసీ పురుషోత్తంరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి బామ్మర్ది మండ్లెం ప్రతాపరెడ్డి సూత్రధారులని టీడీపీ లీగల్ ప్రతినిధులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ వీరి పేర్లను పోలీసులు గోప్యంగా ఉంచారు. వారి పేర్లను తప్పించే ప్రయత్నం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్పీ రఘువీర్‌రెడ్డిలకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పోలీసు ఉన్నతాధికారులు అసలైన నిందితుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చాలని ఆదేశించడంతో వారిద్దరి పేర్లను కూడా చేర్చినట్లు తెలిసింది. సంగమేశ్వరంలో పట్టుబడిన తెలంగాణ మద్యం విషయంలో పోలీసుల గోప్యత పాటించడం అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారమంతా పోలీసు అధికారులకు తెలిసే జరిగిందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇదిలావుంటే తెలంగాణలోని అమరగిరి నుంచి కృష్ణానది మీదుగా ఆత్మకూరుకు రూ.22 లక్షల విలువ మద్యాన్ని తీసుకొచ్చి నిల్వ ఉంచినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే రెండు, మూడు లోడ్‌ల తెలంగాణ మద్యం ఆత్మకూరుకు చేరినట్లు తెలిసింది.


'రాష్ట్రంలో వైసీపీ దుకాణం ఖాళీ'



మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 28: ప్రజా వ్యతిరేక పాలన వల్ల రాష్ట్రంలో వైసీపీ దుకాణం ఖాళీ అవుతోందని నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఆదివారం టీడీపీ నాయకుడు, 12వ వార్డు మున్సిపల్ స్వతంత్ర కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్ లాల్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల, శ్రీశైలం నియోజకవర్గాల్లో వ్యాపార, రాజకీయ వేత్తలైన శిల్పా కుటుంబాలకు ప్రజలు ఓటుతోనే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రారావు, ఏవీఆర్ ప్రసాద్, తాతిరెడ్డి తులసిరెడ్డి, ఎన్ఎండీ ఫిరోజ్, ఆర్యవైశ్య ప్రముఖులు బింగుమళ్ల శ్యామ్‌సుందర్ గుప్తా, ఖండే ఆనంద్‌గురూజీ, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందు లేదు.. మటన్ బిర్యానీ లేదు..



కోడుమూరు, ఏప్రిల్ 28: 'అరే ఎన్నికలు వచ్చాయి. రోజూ మందు, చికెన్ బిర్యానీకి కొదవ ఉండదు అనుకున్నాను. సాయంత్రం అయ్యేసరికి ఇంటి ఖర్చులకు రూ.300 వస్తాయి అనుకున్నా. కానీ ఇదేం కథరా నాయనా. ఎన్నికలు వచ్చి ఇన్ని రోజులవుతున్నా ఏ నాయకుడూ మందు ఇవ్వట్లేదు. చికెన్ బిర్యానీ పెట్టట్లేదు. కనీసం కార్యకర్తలకు ఒక పూట బువ్వ పెట్టే వాడే లేడు. అసలు కోడుమూరులో ఎన్నికల హడావిడే కనిపించడం లేదు' అంటూ కోడుమూరు నియోజకవర్గంలోని ఓ ఇద్దరి సంభాషణ ఇలా..

దాసు : ఏరా గోపాల్. మన కోడుమూరులో ఎన్నికల హడావిడి కనిపించడం లేదు. మందు లేదు.

గోపాల్ : ఏముందిరా దాసు, అభ్యర్థులు కీలక నాయకుల చేతిలో చిక్కుకున్నారు. నాకు తెలియకుండా పైసా కూడా ఖర్చు చేయకు, ఎవ్వరికీ చిల్లిగవ్వ ఇవ్వకు అని పార్టీలోని కీలక నాయకులు అభ్యర్థులకు హుకుం జారీ చేశారంట.

దాసు : అందుకేనా ఎవ్వరూ మందు, చికెన్ బిర్యానీ కాదు కదా కనీసం కార్యకర్తలకు భోజనాలు కూడా పెట్టడం లేదు.

గోపాల్ : దాసూ. నీకు నాయకుల గూర్చి ఒక కథ చెప్తా వింటావా. ఒక ఊరిలో ఒక మద్దిలేటి అనే వ్యాపారి ఉన్నాడంట. ఆ వ్యాపారికి 10 మంది సంతానం. ఆయనకు ఆదాయమే ముఖ్యం. ఇంట్లో పిల్లలు ఆకలి అంటూ ఏడ్చేవాళ్లంట. ఈ పిల్లలతో వ్యాపారం చేసుకోవడం ఎలా అని ఆలోచించాడు. టక్కున వ్యాపారికి ఒక ఆలోచన తట్టింది. వెంటనే అమలు చేశాడు.

దాసు : అబ్బా తొందరగా చెప్పు చాలా ఆసక్తికరంగా ఉంది.

గోపాల్ : తొందర పడకురా చెప్తా. ఆకలితో ఉన్న పిల్లల గదిలోకి వెళ్లి ఒక పేపర్లో ఒక పడి బొరుగులు పోసి సీలింగ్ ఫ్యాన్ స్విచ్ వేశాడు. ఫ్యాన్ స్పీడ్‌ను పెంచాడు. దీంతో ఆకలితో ఉన్న పిల్లలు గాలికి ఎగురుతున్న బొరుగుల కోసం గదంతా పరుగులు తీయడం మొదలు పెట్టారు. ఒక్కో బొరుగు ఏరుకొని కడుపు నింపుకునే ప్రయత్నం చేయసాగారు. ఇలా ఆ వ్యాపారి తన వ్యాపారం పూర్తి చేసుకున్నాడు. వచ్చిన డబ్బును మూటకట్టి ఖజాన వేసుకొని తన రహస్య స్థావరానికి చేర్చుకున్నాడు. కథ అర్థమైందా దాసు.

దాసు : అన్నేయ్ నాకు కథలోని నీతి అర్థం అయిందన్నా..

గోపాల్ : ఏంటో ఆ నీతి చెప్పు

దాసు : ఎన్నికల వేళ అభ్యర్థుల పరిస్థితి ఏంటో కానీ. కార్యకర్తల కడుపు కొట్టి ఆ పార్టీ నాయకుడు మాత్రం డబ్బులు మూటలు ఎత్తుకపోవడానికి వచ్చాడన్నేయ్.

గోపాల్ : ఈ ఎన్నికల పరిస్థితి ఇలా ఉందిరా దాసు.

జగనన్నా.. ఉద్యోగాలు ఎక్కడన్నా..?



కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 28: ప్రభుత్వ రంగంతోపాటు, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పడే అన్ని పరిశ్రమల్లో 75శాతం ఉద్యోగాలు స్థానికులకే వచ్చేలా చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్ ఆ తర్వాత నిరుద్యోగులను గాలికి వదిలేశారు. ఉపాధి చట్టం-2019 ప్రకారం పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగాలు ఇవ్వాలని వైసీపీ ప్రభుత్వం 2019లో చట్టం చేసింది. అయితే చట్టం అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం నిర్వహించడంతో ఏ పరిశ్రమ దీన్ని అమలు చేయలేదు. 2022 సెప్టెంబరు-28న కొలిమిగుండ్ల మండలంలోని కల్వటాల వద్ద రూ.2500 కోట్లతో నిర్మించిన రామ్‌కో సిమెంట్ పరిశ్రమను ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు. ఈసందర్భంగా స్థానికులకు 75శాతం ఉద్యోగాలు వస్తాయని హామీ ఇచ్చారు. దీంతో కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో భూములు కోల్పోయిన యువత ఉద్యోగాలు వస్తాయని సంబరపడ్డారు. అయితే ఏళ్లు గడుస్తున్నా జగనన్న హామీ మాత్రం నెరవేరలేదు. రామ్‌కో సిమెంటు పరిశ్రమలో సుమారు 250 మంది వరకు కంపనీ పర్మినెంట్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండగా, స్థానికులు 30మందికి మించకపోవడం గమనార్హం.

భారత పౌరులే పోటీ చేయాలి



శిరివెళ్ల, ఏప్రిల్ 28 : రాజ్యాంగంలోని 84-ఏ ప్రకారం పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేయాలంటే భారత పౌరులై ఉండాలి. రాజ్యాంగంలోని 173-ఏ ప్రకారం శాసనసభకు కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 4-బీ ప్రకారం ఓటరుగా నమోదు కాని వ్యక్తులు పోటీకి అనర్హులు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్4-సీ, 4-సీసీ, 4-సీసీసీ ప్రకారం ఒక రాష్ట్రానికి చెందిన వ్యక్తి మరొక రాష్ట్రంలో పోటీ చేసే వీలుంది. అయితే ఈ సెక్షన్ల ప్రకారం లక్షదీవులు, అస్సోం, సిక్కిం రాష్ట్రాలలో పోటీ చేసేందుకు వీలుకాదు. జైలులో ఉన్న వ్యక్తి గానీ, ఒక జైలు నుంచి మరొక జైలుకు తరలుతున్న వ్యక్తి గానీ, పోలీసు కస్టడీలో ఉన్న వ్యక్తి గానీ ఓటు వేయడానికి వీలులేదు.

స్మార్ట్ క్యాంపెయిన్



కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 28: స్మార్ట్ క్యాంపెయిన్ ఊపందుకుంది. ఐదేళ్ల కిందటితో పోలిస్తే ప్రచార వ్యూహాల్లో సోషల్ మీడియా వినియోగం మూడింతలు పెరిగిపోయింది. ఫేస్ బుక్ లైవ్‌లు ఇప్పుడు ట్రెండ్‌గా మారాయి. ఓ మాదిరి స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే చాలు ప్రచారం హోరెత్తించవచ్చు. కర్నూల్లో నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ ఇట్లా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలో మురుగు కాలువల దుస్థితిని, వీధుల్లో వేలాడుతున్న విద్యుత్ వైర్లు, బిల్లులు, పెన్షన్ అందక ఐదేళ్లలో ఇబ్బందులు పడిన జనాల వాయిస్‌తో సోషల్ మీడియాలో వైసీపీ వైఫల్యాలను ఎండగడుతూ ప్రచారం చేస్తున్నారు. ఫేస్ బుక్ లైవ్, వాట్సాప్‌తోపాటు ఇతర సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అవి వైరల్‌గా మారుతున్నాయి. తమ ఆలోచనలు, హామీల వీడియోలను చేసి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. ఖర్చు తక్కువ.. ప్రచారం ఎక్కువగా జరిగే స్మార్ట్ క్యాంపెయిన్లతో అభ్యర్థులు దూసుకుపోతున్నారు.

చంద్రన్నకు సైకిల్ కానుక



చంద్రన్నకు కౌతాళం మహిళలు చిన్న సైకిల్ బొమ్మను కానుకగా ఇచ్చారు. ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన కౌతాళం వచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబును కలిసి ఫొటో దిగడానికి మహిళలు పెద్దఎత్తున పోటీ పడ్డారు. ఈ క్రమంలోనే ఓ ఇద్దరు మహిళలు చంద్రబాబును కలిసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. దీంతో చంద్రబాబు వారిని ఆప్యాయంగా పలకరించి వారితో ఓ ఫొటో దిగారు. - కౌతాళం

కట్టప్పలతో కలవరం

- ఎన్నికల వేళ జోరుగా జెండాల మార్పు
- పార్టీ జెండా ఒకటి.. పని చేసేది మరొకరికి
- రాజకీయ వ్యూహాల విషయంలో జాగ్రత్తపడుతున్న నాయకులు



నంద్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ నేతలకు సరి కొత్త చిక్కు వచ్చిపడింది. నిన్నమొన్నటి వరకు ప్రత్యర్థి పార్టీలో ఉన్న నేతలు ఇప్పుడు సొంతవారయ్యారు. తమ వర్గం అనుకున్న వారంతా తెల్లారేసరికి ప్రత్యర్థి పార్టీలో చేరుతున్నారు. ప్రస్తుతం ఏ నియోజకవర్గంలో చూసినా ఇదే తీరు. ఇలా జోరుగా జంపింగ్ జపాంగ్‌ల పర్వం సాగుతోంది. దీనికి తోడు చేరే వారంతా తమ గెలుపు కోసం పని చేసేవారా? లేక ప్రత్యర్థి పార్టీ కోవర్టులా? అన్నది అర్థంగాని పరిస్థితి. ప్రస్తుతం పార్టీల్లోకి చేరికలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో అసలు తమకు అనుకూలురు ఎవరు? కోవర్టులు ఎవరు? వారిని ఎలా పసిగట్టాలి? అనే విషయం అర్థంగాక అభ్యర్థులు సతమతమవుతున్నారు. నిన్న మొన్నటి వరకు తమ వెంట తిరిగిన వారు ఇప్పుడు అవల పక్షాన కనబడే సరికి ఎన్నికల్లో పాల్గొనే నేతల ముఖాల్లో టెన్షన్ కనబడుతోంది. లోగుట్టు అంతా తెలిసినా వారు ప్రత్యర్థితో చేతులు కలిపేసరికి ఎక్కడ తమకు నష్టం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. దీంతో పార్టీ వీడే వారిని మచ్చిక చేసుకునేందుకు ప్యాకేజీ రాజకీయాలు చేస్తున్నారు. ఇంత చేసినా, చివరకు తమకు అనుకూలంగా ఉంటారో? లేదో? అన్న అనుమానం వెంటాడుతోంది. దీంతో ఎన్నికల వ్యూహాలను అందరితో కాకుండా, తమ ఆంతరంగికులుగా మెలిగే ఒకరిద్దరితోనే పంచుకుంటున్నారని తెలుస్తోంది.



గెలిస్తే ఇటు.. ఓడిపోతే అటు

కోవర్టుల అవకాశవాదం 'రెండు వైపులా పదునున్న కత్తి' వ్యవహారాన్ని తలపించక మానదు. ఓ నేత వైపు ఉంటూ ప్రత్యర్థి పక్షం విజయం కోసం కోవర్టులు పనిచేసినపుడు, తను ఉప్పందించిన అభ్యర్థి గెలిచాడా.. గుట్టు చప్పుడు కాకుండా ఆ విజయం క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకుంటాడు. ఆ తర్వాత ఎంచక్కా ఆ నేత నీడలోనే ఉండిపోతూ తన కార్యాలను నిరాటంకంగా చక్కదిద్దుకుంటాడు. ఒకవేళ తను కోవర్టుగా చేసినా ఇవతలి అభ్యర్థే గెలిచాడా.. ఎలాగూ మొదటి నుంచి వీరితోనే ఉంటున్నాడు కాబట్టి వచ్చే ఇబ్బంది పెద్దగా ఏమీ ఉండదు. తను కోవర్టు అని తెలిసే అవకాశమూ ఉండదు. పైగ సదరు అభ్యర్థి విజయంలో తన పాత్ర కూడా ఉందని ప్రచారం చేసుకుంటూ గెలుపు క్రెడిట్‌ను తనకు ఆపాదించుకుంటాడు. ఇలాంటి ఉభయకుశలోపరి సౌలభ్యం కోవర్టులకు మాత్రమే ఉంటుంది.

వారిని నమ్మితే అంతే..

- అధికార పార్టీ మీద అసంతృప్తితో పాటు ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగానో, పార్టీల ఏకపక్ష ధోరణి నచ్చకనో పార్టీలు మారడం సహజం. ఇలా మారే వారిలో చాలా మంది నిజంగా నిండుమనసుతో పార్టీ మారేవారే. కానీ ఒకరిద్దరు మాత్రం కోవర్టు రాజకీయం చేస్తుంటారు. ఈ మొత్తంలో వారిని పసిగట్టడమే పార్టీ నేతలకు పెద్ద పరీక్ష. ఒక్కోసారి నిబద్ధత కలిగిన నేతలను పక్కనబెట్టి కొత్తగా వచ్చిన కోవర్టు నేతలకు పెద్దపీట వేసే నేతలకు జిల్లాలో కొదవేలేదు. ఇలా జరిగితే దెబ్బకు పుట్టి మునగడం ఖాయం.

● కోవర్టులు పలు రకాలు..

ఎన్నికల వేళ ఆ పార్టీలోని నేతలు ఈ పార్టీలోకి, ఈ పార్టీలోని నేతలు ఆ పార్టీలోకి మారడం సహజం. పార్టీ మారినా తమ వారి కోసం పని చేయడమే కోవర్టు రాజకీయం. ప్రత్యర్థి పార్టీ నుంచి తమ పార్టీలోకి వస్తామని వచ్చే కొంత మందిని ఎంచుకుని, పార్టీ మారకుండా అవతలి పక్షంలోనే ఉంటూ తమ గెలుపునకు సహకరించాలని సూచిస్తారు. తమ పార్టీలోని వారిని అవతలి పక్షంలోకి పంపించి ప్రత్యర్థిని దెబ్బకొట్టడం రెండో రకం కోవర్టు రాజకీయం. నంద్యాలలోని ఓ నేత ఈ రకం రాజకీయాలకు పెట్టిన పేరు అనే అభిప్రాయం ఉంది. కోవర్టులకు అవసరమైన పనులు చేసిపెడుతూ, డబ్బులు వెదజల్లుతూ ప్రత్యర్థి పార్టీలో ఉన్న వారిని తమకు అనుకూలంగా మలుచుకుంటాడన్న పేరుంది. ఇక మూడో రకం కోవర్టులు కూడా ఉన్నారు. వీరు తటస్థంగా ఉన్నట్లు కలరింగ్ ఇస్తూ ఏదో ఒక పక్షానికి లోపాయికారిగా పని చేస్తుంటారు. ఎన్నికల సమయంలో డబ్బులు, మద్యం వంటివి పట్టించడం, డబ్బున్న చోటు సమాచారాన్ని పోలీసులకు అందించడం వంటివన్నీ కోవర్టుల పుణ్యమే. ఇలా రకరకాల ముసుగుల్లో కోవర్టులు అభ్యర్థుల విజయావకాశాలను తీవ్రంగా దెబ్బ తీస్తుంటారు.





ప్రధానిహోదాలో పీవీ నంద్యాల పర్యటన (ఫైల్)

గెలుపులో రికార్డు

- 1991లో నంద్యాల ఎంపీ స్థానానికి ఉప ఎన్నిక
- రికార్డు మెజార్టీతో పీవీ నరసింహారావు గెలుపు
- ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఏకపక్ష పోలింగ్

నంద్యాల టౌన్, ఏప్రిల్ 28 : భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సంస్కరణల అపర చాణుక్యుడుగా పేరు గాంచిన తొలి తెలుగుతేజం పీవీ నరసింహారావు నంద్యాల ఎంపీ స్థానం నుంచి రికార్డు మెజార్టీతో విజయం సాధించారు. 1991లో జరిగిన ఎన్నికల ప్రచారంలో అప్పటి మాజీ ప్రధాని, ఏఐసీసీ అధ్యక్షుడైన రాజీవ్‌గాంధీని తమిళ టైగర్లు మానవ బాంబుతో మట్టుబెట్టారు. ఈ ఎన్నికల్లో పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ రావడం, సమర్థుడైన నాయకుడిగా నెహ్రూ కుటుంబేతర వ్యక్తిగా, 16 భాషల్లో అనర్గలంగా మాట్లాడే శక్తి సామర్థ్యాలు కలిగిన సీనియర్ నేత పీవీ నరసింహారావును కాంగ్రెస్ పార్టీ దేశ ప్రధానిని చేసింది. అయితే అప్పటికి ఎంపీ కాకపోవడంతో ఆరు నెలల కాలంలో ఎంపీగా పీవీ గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి సురక్షితమైన స్థానంగా ఉన్న నంద్యాల నుంచి అప్పటి సిట్టింగ్ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి రాజీనామా చేయించి ఎంపీ స్థానం నుంచి పీవీని రంగంలోకి దింపారు. దీంతో నంద్యాల ఎంపీ స్థానం నుంచి ప్రధాని హోదాలో పీవీ నరసింహారావు 1991 ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఆ సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్‌టీ రామారావు టీడీపీ తరపున పీవీపైన పోటీకి ఎవరినీ నిలబెట్టకుండా తెలుగు వ్యక్తిగా అభిమానం చాటారు. అయితే భారతీయ జనతా పార్టీ మాత్రం బంగారు లక్ష్మణ్‌ను పోటీకి నిలిపింది. మరో అభ్యర్థి మండ్ల సుబ్బారెడ్డి పోటీలో ఉన్నప్పటికీ పార్లమెంట్‌లోని ఏడు నియోజక వర్గాల్లోనూ పీవీకి ఏకపక్ష పోలింగ్‌తో ఓటర్లు బ్రహ్మరథం పట్టారు. దీంతో 5,80,035 మెజార్టీతో ప్రపంచ రికార్డు సాధించి ఎన్నికయ్యారు. కానీ 1996లో జరిగిన ఎన్నికల్లో పీవీ రెండోసారి నంద్యాల ఎంపీగా పోటీ చేసి గెలిచినప్పటికీ మెజార్టీ మాత్రం 98,530 వచ్చింది.

నందుల కోటలో 16 సార్లు ఎన్నికలు

- రిజర్వేషన్‌కు పూర్వం అత్యధిక ఎమ్మెల్యేలు రెడ్డి సామాజికవర్గం వారే
- వ్యవసాయ ఆధారిత నియోజకవర్గం

నందికొట్కూరు, ఏప్రిల్ 28: నందికొట్కూరు నియోజకవర్గంలో 16 సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ నియోజకవర్గంలో రెడ్డి సామాజిక వర్గం వారిదే ఆది నుంచి ఆధిపత్యం కొనసాగుతూ వస్తోంది. 2009 ఎన్నికలకు పూర్వం ఒకే ఒక్క ఎన్.కె.లింగం మినహా అందరు ఎమ్మెల్యేలు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారే కావడం గమనార్హం. ఇందులో మొట్టమొదటి ఎమ్మెల్యే చంద్రపుల్లారెడ్డి సీపీఐ నుంచి గెలువగా 2004 గౌరు చరితారెడ్డి వరకు మొత్తం ఎనిమిది మంది రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు 12 సార్లు ఎమ్మెల్యేలు అయ్యారు. ఇందులో అత్యధికంగా కాంగ్రెస్, కాంగ్రెస్(ఐ)తో కలిపి ఎనిమిది సార్లు, టీడీపీ మూడు సార్లు, సీపీఐ ఒకసారి, వైసీపీ రెండు సార్లు విజయం సాధించాయి. ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు గెలిచారు. 1972లో మద్దూరు సుబ్బారెడ్డి ఏకగ్రీవంగా గెలుపొందడం విశేషం. అత్యధికంగా బైరెడ్డి శేషశయనా రెడ్డి మూడు సార్లు గెలవగా, ఆయన కుమారుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి రెండు సార్లు విజయం సాధించారు. కాంగ్రెస్ హయాంలో బైరెడ్డి శేషశయనారెడ్డి రాష్ట్రమంత్రిగా కూడా పని చేశారు. అయ్యపురెడ్డి, మద్దూరు సుబ్బారెడ్డి లోక్‌సభ సభ్యులుగా గెలిచారు. శేషశయనారెడ్డి 1996లో ఇక్కడి నుంచి ఎన్.టి.ఆర్.టి.డి.పి(ఎల్.పి) పక్షాన పోటీ చేసి ఓడిపోయారు.



ప్రచార రథాల జోష్

గ్రామాల్లో హోరెత్తిస్తున్న పాటలు





నందికొట్కూరు, ఏప్రిల్ 28: అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునే ప్రచారానికి తెరలేపారు. పోటీ పడి ప్రచార ఆర్భాటానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు. అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచార వాహనాలను అందంగా తయారు చేసి ప్రచారంలోకి దింపారు. నంద్యాల జిల్లాలోని పాణ్యం, డోన్, బనగానపల్లె, ఆళ్లగడ్డ, నంద్యాల, శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో ఆయా పార్టీల అభ్యర్థుల సంచార వాహనాలు విస్తృతంగా తిరుగుతున్నాయి. తమ పార్టీ గుర్తుకే ఓటు వేయాలని ఓటర్లను చైతన్యపరిచే గీతాలతో హల్‌చల్ చేస్తున్నాయి. తెల్లవారే సరికే గ్రామాల్లో ప్రచార రథాలు దర్శనమిస్తూ సుప్రభాత గీతంలా అభ్యర్థుల గురించి ఘనంగా చెబుతూ హోరెత్తిస్తున్నాయి. చిన్నచిన్న పార్టీల అభ్యర్థులు సైతం ప్రచార రథాలతో ఎన్నికల రణ క్షేత్రంలో హోరెత్తిస్తున్నారు.



గుంటిక పట్టిన కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

తలపాగా చుట్టి.. నాగలి చేతబట్టి..

డోన్, ఏప్రిల్ 28: డోన్ టీడీపీ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆదివారం రైతు అవతారమెత్తారు. ఆదివారం మండలంలోని మల్లెంపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులోభాగంగా అక్కడే పొలంలో ఉన్న రైతును పలకరించి సమస్యను తెలుసుకున్నారు. తలపాగా చుట్టి.. నాగలి చేతబట్టి కాడెద్దులను కదిలించారు. నేను సైతం రైతు బిడ్డనంటూ పొలం దున్ని అక్కడ ఉన్న వారిని ఆశ్చర్యానికి గురి చేశారు.

2014 మినహా.. అదే సెంటిమెంట్

నంద్యాలలో ఎమ్మెల్యేగా గెలిచిన అభ్యర్థి పార్టే అధికారంలోకి..


నంద్యాల టౌన్, ఏప్రిల్ 28 : దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేకమైన నియోజకవర్గంగా పేరొందిన నంద్యాల మరో సెంటిమెంట్ విషయంలో కూడా గుర్తింపు పొందింది. నంద్యాలలో ఎమ్మెల్యేగా గెలిచిన అభ్యర్థి పార్టే.. రాష్ట్రంలో అధికారంలోకి వస్తోంది. 2014 ఎన్నికలు మినహా మిగతా ఎన్నికలన్నింటిలోనూ ఇదే సెంటిమెంట్ కొనసాగింది. 1983 నుంచి 2019 వరకు నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి పదిసార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో 2017లో ఉప ఎన్నిక జరిగింది.. ఈ నేపథ్యంలో తొమ్మిదిసార్లు సార్వత్రిక ఎన్నికల్లో 2014 మినహా మిగతా ఎన్నికల్లో నంద్యాల అసెంబ్లీ నుంచి ఏ పార్టీ అభ్యర్థి శాసన సభ్యుడిగా ఎన్నికయ్యారో అదే పార్టీ అధికారంలోకి వచ్చింది. 2014లో మాత్రం సెంటిమెంట్ పని చేయలేదు. వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన భూమా నాగిరెడ్డి గెలిచారు. రాష్ట్రంలో మాత్రం టీడీపీ అధికారం చేజిక్కించుకుంది. అయితే రెండేళ్లకే భూమా నాగిరెడ్డి వైసీపీకి గుడ్‌బై చెప్పి అధికార టీడీపీ గూటికి చేరారు. 2017లో భూమా నాగిరెడ్డి మరణంతో జరిగిన ఉప ఎన్నికలో అధికార పార్టీ అభ్యర్థి టీడీపీ నుంచి పోటీ చేసిన భూమా బ్రహ్మానందరెడ్డి గెలుపొందారు. 2019 ఎన్నికల్లో ఈ సెంటిమెంట్ పునరావృతమైంది. ఎమ్మెల్యేగా వైసీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి గెలిచారు. ఆ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.. ప్రస్తుతం ఎన్నికల్లో నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థుల గెలుపు ఓటములపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.




నంద్యాల రైల్వేస్టేషన్



అంతా మోసం



(కర్నూలు-ఆంధ్రజ్యోతి):
పత్తికొండ, ఆలూరు, పాణ్యం, డోన్ నియోజకవర్గాల్లో 77 చెరువుల అనుసంధానం పూర్తి చేశాం అని శనివారం సీఎం జగన్ విడుదల చేసిన వైసీపీ మేనిఫెస్టోలో పేర్కొన్నారు. పశ్చిమ ప్రాంతం చెరువులను కృష్ణా జలాలతో నింపి కరువును నివారించాలని గత టీడీపీ ప్రభుత్వంలో అనుకుంది. సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయించి, రూ.224.31 కోట్లు నిధులు ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మొదట్లో పనులు ఆపేసింది. ఆ తరువాత మొదలు పెట్టి నాలుగున్నర ఏళ్ల తరువాత కొన్ని చెరువులకు నీళ్లు ఇచ్చింది. చాలా చెరువులకు పైపులైన్ పనులే పూర్తి కాలేదు. కానీ ఎన్నికల మేనిఫెస్టోలో 77 చెరువులు అనుసంధానం పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఆర్డీఎస్, వేదవతి ప్రాజెక్టుల ఊసే లేదు. టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం భవనాల నిర్మాణాలకు గంపెడు సిమెంట్ వేయలేదు.



అంతా మేమే చేశామని ..

2019 మేలో బాధ్యతలు చేపట్టిన సీఎం జగన్ ప్రభుత్వం పనులను కొనసాగించి ఉంటే గడువులోగా అంటే 2020 జనవరిలోగా చెరువులకు కృష్ణా జలాలు చేరేవి. అయితే.. రెండేళ్ల వరకు గంపెడు మట్టి వేయలేదు. 68 చెరువుల అనుసంధాన పథకం అనగానే చంద్రబాబు పేరు ఎక్కడ గుర్తుకు వస్తుందో అని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మరో 9 చెరువులు చేర్చి 77 చెరువులుగా మార్చారు. పనులు పూర్తి కాకుండానే గత ఏడాది సెప్టెంబరు 9న సీఎం జగన్ చేత హడావుడిగా ప్రారంభోత్సవం చేయించారు. ఆరు నెలలు గడిచినా నేటికి 6-10 చెరువుల పనుల పైప్‌లైన్ పనులు వివిధ కారణాలతో పూర్తి చేయలేదు. పైపులైన్ పూర్తైనా సాంకేతిక సమస్యలు వల్ల పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో చెరువులకు నీళ్లు ఎత్తిపోయలేదు. వాస్తవానికి హంద్రీనీవా నుంచి 106 చెరువులకు అనుసంధానం చేసేలా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఫేజ్-1 కింద 68 చెరువులకు నీళ్లు ఎత్తిపోసేలా పనులు చేపట్టారు. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం తామే ఈ పథకాన్ని చేపట్టి పూర్తి చేసినట్లు చెప్పడం పచ్చి అబద్ధమని రైతులు ప్రశ్నిస్తున్నారు.

- ఓటర్లకు టోపీ పెట్టే వైసీపీ మేనిఫెస్టో
- చంద్రబాబు చేపట్టిన నీటి పారుదల పథకాలన్నీ సొంత ఖాతాలో వేసుకున్న సీఎం
- 77 చెరువులను నింపామని వంచన



హంద్రీనీవా నీళ్లు చేరని తుగ్గలి మండలం రాతన చెరువు

ఆర్డీఎస్, వేదవతి ఊసే లేదు

ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని వేదవతి ప్రాజెక్టును మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో 40 వేల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలని ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టును గత చంద్రబాబు ప్రభుత్వం మంజూరు చేసింది. దాదాపు రూ.3,950 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టింది. జగన్ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాజెక్టు పనులు అటకెక్కాయి. ఐదేళ్లలో వీటి ఊసే లేదు. మళ్లీ అధికారం వస్తే రాష్ట్రంలో ఈ ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామనడం మోసం కాదా..? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.



ఓర్వకల్లు వద్ద పనులు ఆగిపోయిన డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం భవనాలు

ఉర్దూ యూనివర్సిటీకి ఐదేళ్లలో గంపెడు సిమెంట్ వేయలేదు

గత టీడీపీ ప్రభుత్వం కర్నూలులో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసింది. ఓర్వకల్లు విమానాశ్రయం పక్కనే 144.92 ఎకరాలు దీనికి కేటాయించింది. ఫేజ్-1 కింద అకడమిక్ బ్లాక్, బాలికల హాస్టళ్లు, విశాలమైన రోడ్లు నిర్మాణాలు రూ.18 కోట్లతో చేపట్టింది. భవనాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా వైసీపీ ప్రభుత్వం వచ్చి ఎక్కడి పనులు అక్కడే ఆపేసింది. యూనివర్సిటీకి కేటాయించిన భూములపై ప్రభుత్వంలో కీలకంగా ఉన్న వైసీపీ నాయకుడు కన్నేయడం తోనే పనులు ఆపేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఐదేళ్లుగా పట్టించుకోని జగన్.. ఓట్ల కోసం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం వచ్చే ఐదేళ్లల్లో పూర్తి చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొనడం మోసం కాదా..? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

రాయలసీమ జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగునీరు ఇవ్వడం హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం లక్ష్యం. శ్రీశైలం ఎగువన మాల్యాల లిఫ్ట్ నుంచి 40 టీఎంసీలు కృష్ణా వరద జలాలు ఎత్తిపోయాలి. కరువు ప్రాంతాలైన పత్తికొండ, ఆలూరు, డోన్, పాణ్యం నియోజకవర్గాలకు సాగు నీరు అందించడానికి గత టీడీపీ ప్రభుత్వం 68 చెరువులకు హంద్రీనీవా కాలువ నుంచి 1.238 టీఎంసీలు ఎత్తిపోసే అనుసంధానం ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. 2018 మార్చి 20న రూ. 224.31 కోట్లు మంజూరు చేస్తూ జీవో నంబరు 169 జారీ చేశారు. అదే ఏడాది జూన్ 3న నవ నిర్మాణ దీక్షల్లో భాగంగా తుగ్గలి మండలం జొన్నగిరి వద్ద ఈ ప్రాజెక్టుకు చంద్రబాబు, డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి శంకుస్థాపన చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి 2018లో పనులకు శ్రీకారం చుట్టి 2020 జనవరి కల్లా పూర్తి చేశారు. ఈ మేరకు దాదాపు 35 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి.



అసంపూర్తిగా ఆగిపోయిన ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ స్లూయిస్ పనులు

ఓర్వకల్లు విమానాశ్రయం



ఆ ఘనత చంద్రబాబుదే..

ఓర్వకల్లు, ఏప్రిల్ 28: ఓర్వకల్లును పారిశ్రామిక హబ్‌గా మార్చిన ఘనత చంద్రబాబుకే దక్కింది. మండలంలోని శకునాల, గడివేముల మండలంలోని గని గ్రామంలో 5,800 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ పరిశ్రమ పూర్తి చేసుకుని వేయి మెగా వాట్ల విద్యుత్ లక్ష్యంగా విరాజిల్లుతోంది. ఓర్వకల్లు, పూడిచెర్ల, కన్నమడకల గ్రామాల్లోని 1,010 ఎకరాల్లో ఏర్పాటు చేసిన విమానాశ్రయం ఏర్పాటు చేశారు. టీడీపీ హయాంలో గుట్టపాడు, ఎన్.కొంతలపాడు గ్రామాల్లోని 370 ఎకరాల్లో రూ.1,500 కోట్ల బడ్జెట్‌తో జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు భూసేకరణ చేసి పనులు కూడా పూర్తి కావస్తున్నాయి. దీంతో వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. అలాగే ఎయిర్‌పోర్టుకు వెళ్లే రహదారిలో 144 ఎకరాల్లో డా.అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.18 కోట్లు విడుదల చేశారు. విమానాశ్రయం 18 నెలల్లో పూర్తి చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారు. అలాగే ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి చంద్రబాబు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. సోలార్ పార్కు నుంచి ఇప్పటికే వేయి మెగావాట్ల విద్యుత్‌ను సేకరిస్తున్నారు. ఆయుధాల పరిశ్రమ కూడా పూర్తి కావస్తోంది. వీటన్నింటినీ చంద్రబాబు హయాంలోనే పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దారు.

ఆయుధాల పరిశ్రమ - డీఆర్‌డీవో



బ్యాంకు లావాదేవీలపై కన్ను

- డిజిటల్ పేమెంట్లపై ఆరా
- అభ్యర్థుల బంధువుల అకౌంట్లపై దృష్టి

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 28: ఎన్నికల్లో పెద్ద ఎత్తున నగదు చేతులు మారే అవకాశం ఉండడంతో కేంద్ర ఎన్నికల సంఘం నిఘా పెంచింది. బ్యాంక్ అకౌంట్లు, డిజిటల్ పేమెంట్లపై దృష్టి సారించింది. పోటీలో నిలిచిన అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించేందుకు అష్ట కష్టాలు పడుతున్నారు. ఈ క్రమంలో ఆన్‌లైన్ పేమెంట్లు జరుపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పోటీలో నిలిచిన అభ్యర్థుల బంధువులు, మహిళా సంఘాలు, పింఛనుదారుల అకౌంట్ల లావాదేవీల వివరాలను అధికారులను సేకరిస్తున్నారు. ఎప్పటికప్పుడు బ్యాంకు ఖాతాల లావాదేవీల వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పిస్తున్నారు. లక్ష రూపాయల నుంచి పది లక్షల వరకు నగదు జమ, డ్రా చేసే అకౌంట్లను నిశితంగా పరిశీలిస్తున్నారు. బ్యాంక్ అకౌంట్ ద్వారా నగదు పంపిణీ చేయడానికి ఆంక్షలు ఉండడంతో అభ్యర్థులు డిజిటల్ రూపంలో రూ.లక్ష నుంచి ఐదు లక్షల వరకు జరిపే లావాదేవీలపై ఆదాయం శాఖ వారు నిఘా పెట్టారు. అనుమానం ఉన్న ఖాతాలను పరిశీలించే హక్కు బ్యాంక్ అధికారులకు కల్పించారు.

ఎన్నికలలో ఉపయోగించే ముఖ్యమైన ఫారాలు
- ఫారం-10: పోలింగ్ ఏజెంట్ నియామకం
- ఫారం-12 : పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు
- ఫారం-12డి : హోం ఓటింగ్‌కు దరఖాస్తు
- ఫారం-14 : చాలెంజ్ ఓట్లు
- ఫారం-14ఏ : విభిన్న ప్రతిభావంతుల ఓటర్ల డిక్లరేషన్
- ఫారం-17ఏ : ఓటర్ల నమోదు
- ఫారం-17బి : టెండర్ ఓట్లు
- ఫారం-17సి : ఓట్ల ఖాతా
- అనెక్షర్-3 : పోలింగ్ సామగ్రి
- అనెక్షర్-4 : మార్క్ కాపీకి సంబంధించిన సర్టిఫికెట్
- అనెక్షర్-5 : పీవో రిపోర్టు
- అనెక్షర్-6 : పీవో డిక్లరేషన్
- అనెక్షర్-7 : పీవో డైరీ
- అనెక్షర్-9 : పీవో అవుట్‌లైన్ విధులు
- అనెక్షర్-10 : పీవో మెమో తనిఖీ
- అనెక్షర్-11 : పోలింగ్ ఏజెంట్ క్షణం రిజిస్టర్
- అనెక్షర్-12 : పోలింగ్ ఏజెంట్లు ఎంట్రీ పాస్



- అనెక్షర్-13 : పోలింగ్ ఏజెంట్లు ఎంట్రీ పాస్ అకౌంట్
- అనెక్షర్-14 : ఏఎస్‌డీ జాబితాలోని ఓటరు ద్వారా ప్రకటన
- అనెక్షర్-15: ఏజ్ గురించి ఓటర్ల ప్రకటన
- అనెక్షర్-16 : ఏజ్ గురించి ప్రకటన జాబితా
- అనెక్షర్-17 : టెస్టు ఓటు (రూల్ 49 ఎంఏ)
- అనెక్షర్-19 : చాలెంజ్ ఓటు రిసిప్ట్ బుక్
- అనెక్షర్-20 : ఎస్‌హెచ్‌వోకి లేఖ

ఓటర్లకు నేరుగా సందేశాలు..

ఆదోని, ఏప్రిల్ 28: ఎన్నికలు అంటే గోడలపై రాతలు, వాల్ పోస్టర్లు ఒకప్పుడు కనబడేవి. ఇప్పుడు అభ్యర్థులు తమ ప్రచార పంథాను మార్చారు. సామాజిక మాధ్యమాలను ప్రచార అస్త్రాలుగా మార్చుకొని ఓటర్లకు నేరుగా సందేశాలు పంపుతున్నారు. పొద్దున లేవగానే ఫోన్‌కు వివిధ పార్టీల అభ్యర్థుల సందేశాలు వస్తున్నాయి. చాలా మంది అభ్యర్థులు తక్కువ సమయంలో ఎక్కువ ప్రచారాన్ని నిర్వహించేందుకు, ఓటర్లను కలిసేందుకు ఈ సామాజిక మాధ్యమాన్ని వినియోగించుకుంటున్నారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు వివిధ గ్రూపుల్లో తమ ప్రచార వీడియోలను అప్‌లోడ్ చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో పెద్దగా ఖర్చు లేకపోవడం.. తక్కువ సమయంలో ఎక్కువ మంది ఓటర్లకు సందేశాలను పంపడం సులభంగా ఉండటంతో నేరుగా ఫోన్‌లకు సందేశాలు పంపుతున్నారు.

రూ.10 వడ్డీ అయినా ఓకే..

- రంగంలోకి ఫైనాన్షియర్లను దింపిన అభ్యర్థులు

ఆదోని, ఏప్రిల్ 28: రవి ఓ ప్రైవేట్ ఉద్యోగి... వచ్చే జీతంతో కుటుంబాన్ని పోషించుకుంటు న్నాడు. ఎప్పుడైనా అనుకోని ఖర్చులు వస్తే.. తెలిసిన వడ్డీ వ్యాపారి వద్ద అప్పు తీసుకునే వాడు. డబ్బు సర్దుబాటు కాగానే, ఆ అప్పు తీర్చేసేవాడు. ఇటీవల అలా అప్పు కోసం వడ్డీ వ్యాపారిని ఆశ్రయించగా సారి.. రవి.. ఈసారికి డబ్బు ఏర్పాటు చేయలేను... అవకాశం ఉంటే నువ్వే నాకు అప్పు ఇప్పించు. రూ.10ల వడ్డీ అయినా పర్వాలేదు.. చెల్లిస్తాను... అని చెప్పడంతో షాకయ్యాడు...

అదేంటి...? వడ్డీ వ్యాపారం చేసే మీకు అంత ఇబ్బంది ఏం వచ్చిందని అడుగగా.... డబ్బు అవసరం నాకు కాదు, మన ఎమ్మెల్యేకి వచ్చింది. ఎన్నికల్లో గెలవడానికి డబ్బుల పంపిణీ కార్యక్రమానికి నాకు అప్పగించాడు. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున వారి వద్ద ఉన్న డబ్బును బయటకు తీయడం లేదు. అందుకే వివిధ డివిజన్‌లలో ఉండే మా లాంటి వడ్డీ వ్యాపారులకు, ఫైనాన్షియర్‌లకు డబ్బులు పంచే బాధ్యతను అప్పగించాడు. ఇప్పుడు అపులు ఇచ్చే పరిస్థితి లేదు సరికదా..! ఎవరైనా ఇస్తే ఎంతైనా, ఎంతకైనా తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పాడు. పోలింగ్ తేదీ మరో 15 రోజుల్లోకి వచ్చిన నేపథ్యంలో అన్ని పార్టీల అభ్యర్థులు, ఓటర్లకు డబ్బు పంపిణీని వేగవంతం చేయడమే ఈ పరిస్థితికి కారణం. అయితే.. వారు నేరుగా రంగంలోకి దిగకుండా తమ అనుచరుల ద్వారా వడ్డీ వ్యాపారాలు, ఫైనాన్షియర్‌లను రంగంలోకి దింపారు.



వారికి తమ కుటుంబ సభ్యుల్లో ఒకరిని లేదా తమ విశ్వాసపాత్రులను అటాచ్ చేస్తున్నారు. వడ్డీ వ్యాపారులు, ఫైనాన్షియర్లతో సమన్వయం చేసుకుంటూ.. ఖర్చు చేసిన ప్రతి పైసాకు లెక్క రాయడమే వీరి పని...

- **ఎందుకిలా..?**

పోలింగ్ తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు నిఘాను తీవ్రతరం చేశారు. అభ్యర్థులు డబ్బులు పంచుతున్నట్లు తెలిసినా, లేక ప్రత్యర్థి పార్టీలు పసిగట్టి ఆ సమాచారాన్ని వారికి చేరవేసినా... లేని పోని ఇబ్బందులు వస్తాయి. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి డబ్బు తరలించే సమయంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్, నిఘా బృందాలతో పాటు పోలీసులకు పట్టుబడితే ఆ డబ్బును సీజ్ చేస్తారు. ఆ సొమ్మును తిరిగి విడిపించుకోవడానికి చాలా కష్టాలు పడాల్సి వస్తుంది. అందుకే చాలా మంది అభ్యర్థులు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. ఆ అభ్యర్థి గెలిస్తే తమకు మద్దతు ఉంటుందన్న యోచనతో వడ్డీ వ్యాపారులు కూడా వారికి పూర్తిగా సహకరిస్తున్నట్లు సమాచారం.

హలో... అక్కడ ఎవరు గెలుస్తారు..?

ఫోన్ వాకబు



కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 27: హలో.. మన దగ్గర ఎన్నికలు ఎలా జరుగుతున్నాయి..? ఈసారి ఎవరు గెలుస్తారు..? జిల్లాలో ఎన్ని సీట్లు వస్తాయంటూ దేశ, విదేశాలు, పక్క జిల్లాలో ఉన్న బంధువులు, స్నేహితులు ఫోన్ల ద్వారా సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. రోజులో ఏదో ఒక సమయంలో ఫోన్ చేసి సమాచారం అడుగుతున్నారు. ప్రస్తుతం హైదరాబాదులో ఉద్యోగాలు చేస్తూ.. అక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారు కర్నూలు జిల్లా రాజకీయాలపై ఆసక్తి చూపుతున్నారు. వీరితో పాటు ఉద్యోగం, చదువుల నిమిత్తం అమెరికా వెళ్లినవారు కూడా గెలుపు, ఓటములపై ఆరా తీస్తున్నారు. ఇటు జిల్లా వాసులు కూడా పక్క జిల్లాలు, రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో ఉన్న బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి అక్కడ రాజకీయ పరిస్థితుల్ని అడిగి తెలుసుకుంటున్నారు. ఎన్నికలు మొదలైన దగ్గర నుంచి ఫోన్‌లలో రాజకీయాలపై ఆసక్తికరంగా చర్చించుకోవడం గమనార్హం.

పల్లెల్లో.. అంతా సైలెంట్...!



కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 28: ఎన్నికలు దగ్గర పడుతున్నాయి.. గ్రామాల్లో నిశ్శబ్ద వాతావరణమే కనిపిస్తున్నది. ఒక పక్క పోటీల్లో ఉన్న ఇరు అభ్యర్థులు ప్రచారంలో జోరు కనబరుస్తుంటే.. పల్లె ఓటర్లు వారి పనులలోనే నిమగ్నమై ఉన్నారు. దీంతో గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో కూడా హడావుడి కనిపించడం లేదు. ఎన్నికల పిచ్చా పాటి మాటలు వినిపించడం లేదు. నా పార్టీ గొప్పది.. మా అభ్యర్థి ఇది చేశాడు.. అది చేశాడు అనే పోటాపోటీ మాటలు గతంలో లాగా వినిపించడం లేదు. అసలు ఎన్నికల వేళేనా.. అనే సందేహం కలుగుతోంది. దీంతో ఏ పార్టీకి ఎంత ఓటర్లు బలం ఉంటుందనే అంచనా అంతు చిక్కడం లేదు. ఎక్కడా రాజకీయ వేడి కనిపించడం లేదు. అభ్యర్థి ప్రచారానికి వచ్చిన సమయంలో పార్టీ కార్యకర్తలే రోడ్డెక్కుతున్నారు. ఏ పార్టీ వైపు మాటల్లో కూడా మద్దతు తెలపడం లేదు. ఈ విధానం చూస్తుంటే.. గప్‌చిప్‌గా ఓటు వేశామా. వచ్చేశామా. మన పని మనం చూసుకున్నామా.. అనే తీరు గ్రామాల్లో కనిపిస్తోంది.

కర్నూలులోనే బ్యాలెట్ పేపర్ల ముద్రణ



కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 28: సాధారణ ఎన్నికలు-2024కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంటు స్థానాలకు కర్నూలు నుంచే బ్యాలెట్ పేపర్ల ముద్రణ జరుగుతోంది. నగరంలోని ప్రభుత్వ ప్రాంతీయ ముద్రణాలయం కార్యాలయంలో బ్యాలెట్ పేపర్ల ముద్రణ కోసం అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణకు అవసరమైన ముడి సరుకు, సిబ్బంది, విద్యుత్‌కు సంబంధించి ఎలాంటి సమస్యలు లేకుండా ప్రింట్ అండ్ స్టేషనరీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి డా..జి. సృజన, కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఎ. భార్గవతేజ ముద్రణాలయాన్ని తనిఖీ చేశారు. బ్యాలెట్ పేపర్‌కు అవసరమైన ముడిసరుకు, ముద్రణకు అవసరమైన 150 సిబ్బంది ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు పూర్తయిన తరువాత అన్ని జిల్లాల నుంచి ఫైనల్ అయిన అభ్యర్థులు పేర్లు, గుర్తుల జాబితాలు అందిన వెంటనే ముద్రణ ప్రక్రియను పూర్తి చేసి అన్ని జిల్లాలకు బ్యాలెట్ పేపర్లను పంపేలా చర్యలు తీసుకుంటున్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే జైలుకే..

బీ కేర్‌ఫుల్



కర్నూలు (న్యూ సిటీ), ఏప్రిల్ 28: కొంతమంది అభ్యర్థులు సెంటిమెంట్‌ను రెచ్చగొడితే ఓట్లు పడతాయని భావించి కులం, మతం, వర్గం, ప్రాంత భేదాలతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతుంటారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు అరికట్టేందుకు ఎన్నికల సంఘం కఠిన నిబంధనలను రూపొందించింది. ఎన్నికల్లో ఎవరైనా జాతి, మతం, కులం, భాష, సమాజం పేరుతో రెచ్చగొడితే ఐపీఎస్ సెక్షన్ 158ఏ ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. ఓటు కోసం మద్యం, డబ్బులు, ఇతర వస్తువులను తీసుకున్న వారిని కూడా నేరస్తులుగా పరిగణిస్తారు. ఐపీఎస్ సెక్షన్ 171బీ, 171హెచ్ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలు శిక్ష విధిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం సరఫరాపై నిఘా ఉంచారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిన వారు కూడా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

పొంగనాలు నేనూ వేస్తాను...

చిరు వ్యాపారులను ఆదుకుంటాం



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం జొహరాపురంలో టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓ హోటల్ వద్ద స్వయంగా పొంగనాలు వేశారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత చిరువ్యాపారుల తీవ్రంగా నష్టపోయారన్నారు. నెల రోజుల తర్వాత టీడీపీ ప్రభుత్వం రానుందని మీ కష్టాలన్నీ తీరుస్తానని హామీ ఇచ్చారు.

- కర్నూలు అర్బన్

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఎమ్మెల్యే శిల్పా హామీలు కాగితాలకే పరిమితం: బుడ్డా

వెలుగోడు, ఏప్రిల్ 28: ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, ఎంపీ అభ్యర్థి శబరి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు వెలుగోడు పట్టణంలో రోడ్ షో నిర్వహించారు. బుడ్డా మాట్లాడుతూ జనసేన, బీజేపీ అండతో శ్రీశైలంలో టీడీపీ జెండా ఎగురవేయడం ఖాయమని అన్నారు. ఇందుకు ప్రజలు ఒక్క నెలరోజుల పాటు కష్టపడితే.. ఐదేళ్ల పాటు మీకోసం పాటుపడుతానని భరోసా ఇచ్చారు. శబరి మాట్లాడుతూ..బుడ్డా రాజన్నతో నియోజకవర్గ ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. ఏరాసు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ బుడ్డా రాజశేఖరరెడ్డిని, బైరెడ్డి శబరిని గెలిపించుకోవాల్సి అవసరం ఉందన్నారు. టీడీపీ నాయకులు రజాక్, శేషిరెడ్డి, కృష్ణుడు, కలాం, ఖలీల్, జాకీర్ హుసేన్, ఖలీల్, భూపాల్, రామానాయుడు, చంద్ర, జనసేన నాయకులు శ్రీరాములు, అభిమన్యుడు, షాలు బాషా, బీజేపీ నాయకులు ప్రతాప్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలో టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదివారం ప్రచారం నిర్వహించారు. ముందుగా సెంటిమెంట్ ప్రకారం ఇందిరేశ్వరం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టి అక్కడి నుంచి శ్రీపతిరావుపేట, కృష్ణాపురం, అమలాపురం గ్రామాల్లో జరిగిన రోడ్‌షోల్లో ఆయన పాల్గొన్నారు. బుడ్డా మాట్లాడుతూ టీడీపీ హయంలో అన్ని గ్రామాల్లో సీసీరోడ్లు, పంటపొలాలకు రస్తాలు, తాగునీటి ట్యాంకుల నిర్మాణాలు చేపట్టి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించామని అన్నారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు వంగాల శివరామిరెడ్డి, కంచర్ల గోవిందరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, తిరుపమయ్య, కొండలరావు, రవీంద్రనాయక్, పుల్లారెడ్డి, శ్రీనివాసులు, నబీరసూల్, రవీంద్రబాబు ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

● పట్టణంలోని 1వ వార్డుకు చెందిన ఇటుకల బట్టీ యజమాని షేక్ ఖాదర్ బాషా, ముర్తుజా ఆధ్వర్యంలో సుమారు 50 ముస్లిం మైనార్టీ కుటుంబాలు కుటుంబాలు వైసీపీ వీడి బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. ఖాదర్‌బాషా మాట్లాడుతూ.. తమను వైసీసీలోనే కొనసాగాలని ఆ పార్టీ నాయకులు అనేక విధాలుగా ప్రలోభాలకు, బెదిరింపులకు పాల్పడినప్పటికీ తాము మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి నాయకత్వంపై నమ్మకంతో టీడీపీలో చేరినట్లు వివరించారు. పార్టీలోకి చేరిన వారిలో వలి, షేక్షావలి, షాషావలి, ఖాజా, ఖాదర్‌వలి, రోషన్, మాలిక్, మల్లి, రఫీక్, నిరంజన్ తదితరులు ఉన్నారు. ఆత్మకూరులోని ఆర్పన్‌కాలనీకి చెందిన నన్నూరు మద్దిలేటి ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు వైసీపీని వీడి బుడ్డా శైలజమ్మ సమక్షంలో టీడీపీలో చేరాయి.



వెలుగోడు రోడ్ షోలో మాట్లాడుతున్న బుడ్డా రాజశేఖరరెడ్డి

శ్రీశైలం: శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి కుమార్తె మేఘనారెడ్డి, తన భర్త జయంత్‌తో కలిసి ఆదివారం సుండిపెంటలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేపట్టారు. ప్రచారానికి ముందుగా పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో మేఘనారెడ్డి, జయంత్ దంపతులు ప్రత్యేక పూజలు చేసి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కూటమి నాయకులు యుగంధర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, సాయిరాం, మల్లికార్జున, కన్నయ్య, ఉమామహేశ్వరరావు, ప్రవీన్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే గ్రామాభివృద్ధి: ఫరూక్

గోస్పాడు, ఏప్రిల్ 28: గ్రామాల్లో అభివృద్ధి పనులు టీడీపీ హయాంలోనే జరిగాయని, వైసీపీ పాలనలో ఒక్క అభివృద్ధి పని కూడా కనిపించడం లేదని నంద్యాల టీడీపీ నంద్యాల అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఆదివారం ఎస్ నాగులవరం, నెహ్రూనగర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ చెప్పిన సూపర్ సిక్స్ గ్యారెంటీలు అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చే విధంగా ఉన్నాయని, ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, సుధాకర్ నాయుడు, గోసుల నాగేశ్వరరావు, శేషారెడ్డి, మహానందిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, వెలుగొండారెడ్డి, బీవీ కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబు సభకు తరలి రావాలి'

కొత్తపల్లి, ఏప్రిల్ 28: టీడీపీ అధినేత చంద్రబాబు సోమవారం నందికొట్కూరు పట్టణానికి వస్తున్నారని, సభకు తరలి రావాలని టీడీపీ కన్వీనర్ మండల నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామిగౌడు కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని చంద్రబాబు పర్యటన సభను విజయవంతం చేయాలని కోరారు.

'జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం'

నంద్యాల టౌన్, ఏప్రిల్ 28: జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైపోయిందని నంద్యాల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జె.లక్ష్మీనరసింహ యాదవ్ ధ్వజమెత్తారు. నంద్యాలలోని గాంధీనగర్, బొగ్గులైన్ వీధుల్లో ఆదివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి నంద్యాల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. ఆయన పాలనంతా దోపిడీకే సరిపోయిందన్నారు.



పథకాల గురించి వివరిస్తున్న లక్ష్మీనరసింహ యాదవ్

వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం కుదేలు: గౌరు చరిత

పాణ్యం, ఏప్రిల్ 28: వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం కుదేలైందని పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరు చరిత ఆరోపించారు. మండలంలోని కొనిదేడు, కందికాయపల్లి, పాణ్యం గ్రామాలలో ఆదివారం నిర్వహించిన టీడీపీ శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. గౌరు చరిత మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి గానీ, పర్యవేక్షణ గానీ లేకపోవడంతో నిర్వీర్యమైందని అన్నారు. ఆరుసార్లు గెలిచిన నాయకులు పంట కాలువలు, పంట రస్తాల అభివృద్ధికి పాటుపడిందేమీ లేదన్నారు. ఎంత సేపున్నా తన స్వలాభం, తన అనుచరుల దౌర్జన్యాలు చూస్తూ మౌనంగా ఉండడం తప్ప నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడిందేమీ లేదన్నారు. తన సొంత గ్రామంగా చెప్పుకునే కొనిదేడులో మౌలిక సదుపాయాలు లేవన్నారు. ఎస్సార్బీసీ పంట కాలువలు శిథిలమైనా పట్టించుకునే నాథుడే లేడన్నారు. పంట కాలువలకు సక్రమంగా నీరు వదలకపోవడంతో ప్రతిసారీ కార్యాలయాల వద్ద నిరసనలు చేయాల్సి వస్తోందన్నారు. గతంలో ఎస్సార్బీసీ భూముల కొనుగోలులో కమీషన్ తీసుకొని ప్రజలకు దూరమైనాఇప్పటికీ ఇంకా అవే అక్రమాలు చేస్తున్నారని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. కందికాయపల్లిలో సోలార్ పరిశ్రమతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పశువులను వైసీపీ నాయకులు సంరక్షించుకోలేక అమ్ముకోవాల్సిన దుస్థితి తెచ్చారని ఆరోపించారు. ప్రభుత్వ భూములు సాగు చేసుకొనే రైతులకు సోలార్ పరిశ్రమ నష్ట పరిహారం అందించడం లేదన్నారు. పట్టా భూములకు అడ్వాన్సు కింద కొంత పరిహారం ఇచ్చి జాప్యం చేస్తూ భూముల వద్దకు రానీయడం లేదన్నారు. ప్రజల అనుమతి లేకుండానే ప్రభుత్వం కొత్త జీవోలు తెచ్చి దళితుల భూములను లాక్కునే పథకం వేసిందని ఆరోపించారు. వైసీపీ నాయకుల దాడులు, దౌర్జన్యాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఇటీవల ఓర్వకల్లు మండలం తడకనపల్లెలో ముస్లింలపై దాడులు నిర్వహించి దౌర్జన్యానికి పాల్పడుతున్నారన్నారు. వైసీపీ పాలనలో ఎస్సీలపై దాడులు పెరిగాయన్నారు. దళిత వైద్యుడు సుధాకర్‌ను పిచ్చివాడిగా ముద్రవేసి చంపివేశారన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబును తన డ్రైవర్‌ను చంపి మృతదేహాన్ని పార్శిల్ చేశారని, ఇవన్నీ వైసీపీ పాలనకు నిదర్శనమని అన్నారు. ఇటీవల దుర్వేశిలో టీడీపీ కార్యకర్తపై దాడి చేసిగాయపర్చారన్నారు. వైసీపీ పాలనలో మహిళలపై దాడులు పెరిగాయన్నారు. అన్న క్యాంటీన్లు మూసివేసి పేదప్రజల కడుపు కొట్టిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబు రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలతో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని అన్నారు. మాజీ జడ్పీటీసీ నారాయణమ్మ, ఎంపీటీసీ రంగరమేష్, జయరామిరెడ్డి, రాంపుల్లారెడి, మాజీ ఎంపీటీసీలు రామగోవిందరెడ్డి, నాయకులు తిరుపాలు, నారాయణ, ఈశ్వరయ్య, బాలసుబ్బయ్య, రమణమూర్తి, రామ్మోహన్‌నాయుడు, ఖాదర్‌బాషా, సుభహాన్, సుబ్బయ్య పాల్గొన్నారు.



కందికాయపల్లి గ్రామంలో ప్రచారంలో పాల్గొన్న గౌరు చరిత

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి: మాండ్ర

నందికొట్కూరు, ఏప్రిల్ 28: టీడీపీ అధినేత చంద్రబాబు నందికొట్కూరు నియోజకవర్గంలో చేపట్టిన ప్రజాగళం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. అల్లూరు గ్రామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నిర్మాణ పనులను మాండ్రతో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య ఆదివారం పరిశీలించారు. నందికొట్కూరు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గుండం రమణారెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

● తరిగోపుల గ్రామ మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, దొరబాబురెడ్డి, గిరీశ్వర్‌రెడ్డి, కోట్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో తరిగోపుల గ్రామ వైసీపీ నాయకులు బాబురావు, కృష్ణ, కురువ శంకర్, శ్రీరాములు, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరితో పాటు మరో 20 కుటుంబాలకు చెందిన మహేష్‌రెడ్డి, కురువ బాస్కర్, అయ్యబ్ ఖాన్, కురువ ఓబులేసు తదితరులు పార్టీలో చేరారు.

● నందికొట్కూరు టీడీపీ నాయకురాలు మీనాక్షి, ఆర్ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ నందికొట్కూరు తాలుకా ఇన్‌చార్జి, నంద్యాల జిల్లా అధ్యక్షురాలు డా.వనజ ఆధ్వర్యంలో మాండ్ర శివానందరెడ్డి, మాండ్ర ఉమాదేవిల సమక్షంలో ఆర్ఎంపీ డాక్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డా.నాగరాజు ఆర్ఎంపీలు అనూరాధ, గీతారాణి, రమణ చేరారు. అలాగే సంకిరేణిపల్లెకు చెందిన 98 జీవో బాధితులు చెన్నయ్య, సురేష్, శ్రీనివాసులు, చంద్రశేఖర్ తదితరులతో పాటు 30 మంది టీడీపీలో చేరారు.

● నందికొట్కూరులోని 4వ వార్డు బూత్ ఇన్‌చార్జి వడ్డె శ్రీనివాసులు, సురేష్, శేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి మూర్తుజావలి ఆధ్వర్యంలో మాండ్ర శివానందరెడ్డి ప్రచారం చేశారు. నాయకులు శ్రీను, కృష్ణ, సీతారాం, శ్రీకాంత్ గౌడు పాల్గొన్నారు.

● నందికొట్కూరులో మాండ్ర శివానంద రెడ్డి, నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య సమక్షంలో వైసీపీకి చెందిన నాయకులు జాలంగారి నాగన్న, కొణిదేల రవితో పాటు 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

మిడుతూరు: మిడుతూరు మండలాన్ని వైసీపీ ప్రభుత్వం విర్మరించిందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య సమక్షంలో మిడుతూరు గ్రామంలో మండల కన్వీనర్ కాతా రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. జయసూర్య చెరుకు రసం తీసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గుండం రమణారెడ్డి, శివరామిరెడ్డి, రామ స్వామి రెడ్డి, సర్వోత్తమరెడ్డి, కాతా రాములురెడ్డి, రవీంద్రబాబు, మనోహరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాండ్ర శివానందరెడ్డి, జయసూర్య సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

డోన్, ఏప్రిల్ 28: డోన్ పట్టణంలో సోమవారం జరిగే టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలను కోరారు. ఆదివారం పట్టణంలోని తన నివాసంలో కోట్ల మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్న లక్ష్యంతో చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బీజేపీ తోనూ కలిశారన్నారు. చంద్రబాబు పర్యటనను కోట్ల కుటుంబ సభ్యులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, తనయుడు కోట్ల రాఘవేం ద్రరెడ్డిల ఆధ్వర్యంలో భారీ జనసమీకరణ చేస్తున్నారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి పెద్దఎత్తున జనాలను సమీకరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్యాపిలి: డోన్‌లో సోమవారం నిర్వహించే చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు టి శ్రీనివాసులు, రామ్మోహన్‌యాదవ్, అలేబాదు పరమేష్, ఖాజాపీర్ పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి సాగనంపండి

డోన్(రూరల్), ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని ఇంటికి సాగనంపాలని డోన్ కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి గార్లపాటి మద్దిలేటి కోరారు. ఆదివారం పట్టణంలోని పాతపేట పలు వీధుల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. నాయకులు మల్లెంపల్లె జనార్దన్ యాదవ్, మహేంద్ర నాయుడు, మల్లికార్జున, హనుమాన్, సురేష్ పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి

సంజామల, ఏప్రిల్ 28: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర అన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మండలంలోని అల్వకొండ, గిద్దలూరు, ఆర్ లింగదిన్నె గ్రామాలలో ఎస్ఐ రమేష్‌రెడ్డి బీఎస్ఎఫ్ ఎస్ఐ కృష్ణకుమార్ సింగ్ సిబ్బందితో కలిసి ఆయా గ్రామాలలో కవాతు నిర్వహించారు. ఆయా గ్రామాలలోని ప్రజలతో సమావేశమై ఎన్నికల నియమావళి గురించి వివరించారు.

ముగిసిన చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

బేతంచెర్ల, ఏప్రిల్ 28: పట్టణంలోని చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు పారువేటతో ఆదివారం ముగిశాయి. స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో అధిష్ఠించి ఊరేగించారు. అనంతరం పారువేట నిర్వహించారు. కార్యక్రమంలో గ్రూపు దేవాలయాల ఈవో మద్దిలేటి, ఆలయ చైర్మన్ గుండా జగన్మోహన్‌రావు, ధర్మకర్తలు బుగ్గన విశ్వనాథరెడ్డి, మారుతి కృష్ణశర్మ, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర

చాగలమర్రి, ఏప్రిల్ 28: మండలంలోని చింతలచెరువు గ్రామంలో ఆదివారం గంగ జాతర వైభవంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఎస్ఐలు రమణయ్య, రామాంజనేయరెడ్డి, ఏఎస్ఐలు, పోలీసులు జాతర సందర్భంగా బందోబస్తు నిర్వహించారు.

వెంకటేశ్వరరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

బేతంచెర్ల, ఏప్రిల్ 28: పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, నంద్యాల జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పోలూరు వెంకటేశ్వరరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని పార్టీ సీనియర్ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. అలాగే విషయం తెలిసిన వెంటనే టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శులు ధర్మవరం సుబ్బారెడ్డి, నాయకులు తుగ్గలి నాగేంద్ర, డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, కోట్ల రాఘవేంద్రరెడ్డిలు కలిసి పోలూరు వెంకటేశ్వరరెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు.

'వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి'



రాంపల్లెలో రోడ్‌షోలో మాట్లాడుతున్న భూమా జగత్ విఖ్యాతరెడ్డి

చాగలమర్రి, ఏప్రిల్ 28: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు రోజులు దగ్గరపడ్డాయని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం రాంపల్లె, చిన్నబోదనం, పెద్దబోదనం, మద్దూరు గ్రామాల్లో రోడ్‌షో కార్యక్రమాన్ని నిర్వహించి సూపర్-6 పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నాయకులు నరసింహారెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, నాయకులు కె.రామిరెడ్డి, లక్ష్మీరెడ్డి, రామకృష్ణారెడ్డి, శజ్జారెడ్డి, రమణారెడ్డి, చిన్నారెడ్డి, ఓబులేసు, సుబ్రమణ్యం, శేఖర్‌రెడ్డి, పుల్లయ్య, ప్రతాప్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

నంద్యాల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో టీడీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకుడు భూమా విఖ్యాత్‌రెడ్డి, భార్గవ్‌రామ్‌నాయుడు పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ అసెంబ్లీ పరిధిలోని శిరివెళ్ల మండలం వంకిందిన్నె గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, ఉప సర్పంచ్ సాయికుమార్‌తో పాటు 50 కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరాయి. ఆదివారం ఆళ్లగడ్డ పట్టణంలో చేరారు.

ఉయ్యాలవాడ: ఆళ్లగడ్డలో టీడీపీని గెలిపించాలని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్.పాంపల్లె, హరివరం గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. నాయకులు వెంకటేశ్వరరెడ్డి, శేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, శేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి రోడ్‌షో నిర్వహించారు. వెంకట్రామిరెడ్డి, మల్లేశ్వరచౌదరి, భూమా సందీప్‌రెడ్డి, సిద్ధి సత్యం, వెంకట్‌నాయుడు, రమణయ్య, హబీబ్‌బాషా, వెంకటేశ్వర్‌రెడ్డి, జనసేన నాయకులు మహబూబ్‌దౌలా, ఎంపీటీసీ మహబూబ్‌బాషా తదితరులు ఉన్నారు.

జగనాసుర రక్త చరిత్ర చార్జిషీట్ విడుదల

బనగానపల్లె, ఏప్రిల్ 28: సీఎం జగన్ జగనాసుర రక్త చరిత్ర చార్జిషీట్‌ను బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం బనగానపల్లెలో విడుదల చేశారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కూటమి దూకుడు పెంచింది. జగన్ అరాచక పాలన అంతం - కూటమి పంతం.. కూటమి రూపొందించిన జగనాసుర రక్త చరిత్ర పేరుతో రూపొందించిన చార్జిషీట్‌ను బనగానపల్లెలో జరిగిన కార్యక్రమంలో బీసీ జనార్దన్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, యువ నాయకులు కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, టంగుటూరు శ్రీనయ్య, బురానుద్దీన్, కాశీంబాబు, రాయలసీమ సలాం తదితరుల ఆధ్వర్యంలో విడుదల చేశారు. వైసీపీ పెత్తందారీ పాలనలో రాష్ట్రం విధ్వంసం అయిందని, సీఎం జగన్‌కు ఏమాత్రం విశ్వసనీయత, నైతికత లేదని విమర్శించారు. ఐదేళ్ల నిరంకుశ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు, పన్నులు, చార్జీలు, అప్పుల బాదుడుతో ఒక్కో కుటుంబంపై రూ.10 లక్షల భారం మోపాడన్నారు. విషపూరిత మద్యం పోసి 35 లక్షల మంది ఆరోగ్యాలు పాడు చేసి, 30వేల మంది మహిళల మాంగల్యాలను తెంచారన్నారు. 10సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ.75వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారన్నారు. వందకు పైగా గత టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన టీడీపీ పథకాలు రద్దు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను 600 మందిని వైసీపీ ప్రభుత్వంలో హత్య చేశారన్నారు. రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ రాష్ట్రంగా మార్చి యువతను నిర్వీర్యం చేశారన్నారు. ఇలా ఎన్నో నేరాలు ఘోరాలు చేసినందుకు జగనాసుర రక్త చరిత్ర అంటూ జగన్ అరాచక పాలనపై ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో రూపొందించిన చార్జీ షీటును ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నట్లు బీసీ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఐదేళ్లలో రాష్ట్రాన్ని నాశనం చేశారు: బీసీ

వైసీపీ ఫ్యాన్ రెక్కలు ముక్కలవడం ఖాయమని, ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందని బీసీ జనార్దన్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని శివనందినగర్, పెండేకంటి నగర్‌లలో బీసీ జనార్దన్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాక్షస పాలన నుంచి ప్రజలకు మరో 15రోజుల్లో పూర్తి స్వేచ్ఛ లభిస్తుందన్నారు. ఏపీ ప్రజలు సీఎం జగన్‌ను, ఎమ్మెల్యే కాటసానిరామిరెడ్డిని ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ ఐదేళ్ల విధ్వంస పాలనలో రాష్టం అన్ని విధాలా నాశనం అయిందన్నారు. ఎస్సీ, ఎస్టీకి చెందిన 28 పథకాలు, బీసీలకు చెందిన 30 పథకాలు, మైనార్టీలకు చెందిన 11 పథకాలు రద్దు చేశారని అన్నారు. 5 ఏళ్లలో మేనిఫెస్టోలో 30 శాతం హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల వారిని వంచించిన వైసీపీని శాశ్వతంగా రాజకీయ సమాధి చేయడం ఖాయమని బీసీ అన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను కాటసాని చంద్రశేఖర్‌రెడ్డితో కలసి వివరించారు. బురానుద్దీన్, కాశీంబాబు, రాయలసీమ సలాం, కలాం, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, టంగుటూరు శ్రీనయ్య, అధిక సంఖ్యలో బనగానపల్లె పట్టణ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగనాసుర రక్త చరిత్ర చార్జిషీట్‌ను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

పెట్నికోటలో వైసీపీకి షాక్: కొలిమిగుండ్ల మండలం పెట్నికోట గ్రామానికి చెందిన గొంగటి హుసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆకుల వెంకటశివారెడ్డి, కొప్పుల శివరామిరెడ్డి, నామాల రవీంద్ర, దూదేకుల దస్తగిరి, గొంగటి వెంకటరామిరెడ్డి, నాగిరెడ్డి, పవన్ కళ్యాణ్‌రెడ్డి, కుమ్మరి సుబ్బరాయుడు, కదిరి కృష్ణారెడ్డి, కొప్పుల నాగేంద్రారెడ్డి తదితర 30 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి ఆదివారం టీడీపీలో చేరారు. బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో వీరికి బీసీ జనార్దన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు.





మాజీ ఎమ్మెల్యే బీసీ సమక్షంలో టీడీపీలో చేరిన పెట్నికోట వైసీపీ నాయకులు, సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి, కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి

టీడీపీలో చేరిక

ప్యాపిలి, ఏప్రిల్ 28: మండలంలోని కలచట్ల గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన పలువురు వైసీపీ వర్గీయులు ఆదివారం డోన్‌లో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సమక్షంలో పార్టీలో చేరారు. టీడీపీ రాష్ట్ర కార్య దర్శి వై నాగేశ్వరరావుయాదవ్, గండికోట రామసుబ్బయ్య ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు.

టీడీపీ గెలుపునకు కృషి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 28: టీడీపీ గెలుపునకు కృషి చేస్తామని జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి భాస్కర్ అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాల యంలో జనసేన నాయకులు బీసీ జనార్దన్‌రెడ్డిని కలసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వైసీపీ నాయకులు కేసులు పెట్టినా భయపడవద్దని జనసేన పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని బీసీ హామీ ఇచ్చినట్లు భాస్కర్ తెలిపారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

చాగలమర్రి, ఏప్రిల్ 28: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ, జనసేన నాయకులు ఓబయ్య, నాగేంద్ర, పాల షరీఫ్ అన్నారు. ఆదివారం పెద్దవంగలి గ్రామంలో ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ తరపున టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి సూపర్-6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థులకు రక్షణ కల్పించాలి

డోన్(రూరల్), ఏప్రిల్ 28: నంద్యాల జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పోటీలో ఉన్న స్వతంత్ర అభ్యర్థులకు జిల్లా అధికారులు రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబరు ఏఈ నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం డోన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాన్య కుటుంబాలకు చెందిన పలువురు రాజకీయాల మీద ఆసక్తితో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీకి దిగారన్నారు. అయితే.. కొన్ని రాజకీయ పార్టీలు స్వతంత్ర అభ్యర్థులకు పోటీ నుంచి విరమించుకోవాలని ఒత్తిళ్లు తెస్తున్నట్లు ఆరోపించారు. స్వతంత్ర అభ్యర్థులు ప్రజాస్వామ్యంలో నిర్భయంగా పోటీల్లో నిలిచేందుకు సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వినియోగదారుల రక్షణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ జట్టు ఎంపికకు పోటీలు

చాగలమర్రి, ఏప్రిల్ 28: చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ స్థాయి బేస్‌బాల్ జట్టు ఎంపిక కోసం ఆదివారం పోటీలు నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలను రాష్ట్ర బేస్‌బాల్ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి, సీఈవో మాధవరావు ఆదివారం ప్రారంభించారు. 26 జిల్లాలకు చెందిన 130 మంది బాల బాలికలు పాల్గొన్నారు. జాతీయస్థాయి జట్టు ఎంపిక కోసం బేస్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విశ్రాంత విజిలెన్స్ అధికారి నరసింహ, ఆర్గనైజర్ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా కార్యదర్శులు సాంబశివరావు, వేమారెడ్డి, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

రాజోలికి జలకళ

చాగలమర్రి, ఏప్రిల్ 28: మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద కుందూకు ఆదివారం జలకళ సంతరించుకుంది. ఒట్టిపోయిన కుందూ అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఎగువన నీరు విడుదల చేశారు. దీంతో ఆనకట్టకు నీరు చేరింది. రైతులు, మూగజీవాలకు తాగేందుకు నీరు రావడంతో ఉపశమనం కలిగింది.

జేబులు నింపుకోడానికే బుగ్గన అభివృద్ధి

- చెరువులకు నీళ్లు నింపి రైతులను ఆదుకుంటాం
- డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, ఏప్రిల్ 28: డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గన చెబుతున్న అభివృద్ధి అంతా జేబులు నింపుకోవడానికే తప్ప.. ప్రజలకు ఒరిగిందేమీ లేదని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి విమర్శించారు. ఆదివారం మండలంలోని దొరపల్లి, లక్ష్మంపల్లి, మల్లెంపల్లి, బొంతిరాళ్ల గ్రామాల్లో కోట్ల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గ ప్రజలకు తాగునీరు ఇచ్చింది తామేనన్నారు. ప్రతి గ్రామానికి రోడ్ల సౌకర్యం కల్పించామని, పేద విద్యార్థుల కోసం పాఠశాలలు నిర్మించామన్నారు. తాము వేసిన రోడ్ల మీద మంత్రి బుగ్గన మళ్లీ రోడ్లు వేసి డబ్బులు సంపాదించుకున్నారని ఆరోపించారు. ఐదేళ్ల పాటు చెరువులకు నీరు నింపకుండా మంత్రి బుగ్గన ఏం చేశారని ప్రశ్నించారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని, చెరువులకు నీరు నింపి రైతులను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మాజీ ఎంపీపీ శేషఫణి గౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, దేవరబండ వెంకటనారాయణ, భాస్కర్ నాయుడు, అబిరెడ్డిపల్లె గోవిందు, జయన్న యాదవ్, సర్పంచ్ రామిరెడ్డి, దొరపల్లి నాగరాజుగౌడు, లక్ష్మంపల్లె జనార్దన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



మాట్లాడుతున్న కేఈ కృష్ణమూర్తి

అబద్ధాల మేనిఫెస్టో : కేఈ కృష్ణమూర్తి

సీఎం జగన్ ప్రకటించిన వైసీపీ మేనిఫెస్టోలో అన్నీ అబద్ధాలే ఉన్నాయని మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం డోన్ పట్టణంలో కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డితో కలిసి కేఈ ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేఈ కృష్ణమూర్తి మాట్లాడుతూ గత ఎన్నికల ముందు వైఎస్ జగన్మోహన్ రెడ్డి మోసపు హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చారన్నారు. 99 శాతం హామీలు నెరవేర్చానని జగన్ మేనిఫెస్టో పచ్చి అబద్ధాలు చెప్పడం ప్రజలకు అర్థమైపోయిందన్నారు. ప్రజల విశ్వాసం కోల్పోయిన జగన్ ప్రకటించిన మేనిఫెస్టోను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో రాష్ట్ర ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఇచ్చేలా ఉందన్నారు. పేదలకు సామాజిక పింఛన్ చంద్రబాబు రూ.4వేలు ప్రకటిస్తే.. సీఎం జగన్ మూడేళ్ల తర్వాత రూ.3,500 ఇస్తానని ప్రకటించడం హాస్యాస్పదం అన్నారు. రైతులను ఆదుకునేందుకు రూ.20వేల ఆర్థిక సాయం ఏడాదికి అందిస్తామని చంద్రబాబు హామీ ఇస్తే.. జగన్ రూ.16వేలు ఇస్తామన్నారు. టీడీపీ మేనిఫెస్టో ముందు వైసీపీ మేనిఫెస్టో ఏ మాత్రం పనికిరాదన్నారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ తల్లికి వందనం పథకం కింద ఇంట్లో చదువుతున్న పిల్లలందరికీ రూ.15వేలు చంద్రబాబు ప్రకటిస్తే.. సీఎం జగన్ ఇంట్లో చదివే పిల్లల్లో ఒకరికి మాత్రమే రూ.15వేలు ఇస్తామని చెప్పారన్నారు. వైసీపీ మేనిఫెస్టోపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని, వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఆలంకొండ నబీసాబ్, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి శ్రీరాములు, ఆలా మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంచిపట్టు చీరల స్వాధీనం

చాగలమర్రి, ఏప్రిల్ 28: చాగలమర్రి గ్రామంలోని టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులో ఆదివారం ఎస్ఎస్‌టీ టీమ్ అధికారి తులసీకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్, పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కంచి పట్టు చీరలు పట్టుబడ్డాయి. కడప జిల్లా నుంచి నంద్యాల వైపు వెళ్తున్న వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.50 లక్షలు విలువ చేసే కంచి పట్టు చీరలు పట్టుబడ్డాయని, వాటిని చాగలమర్రి పోలీసు స్టేషన్‌కు స్వాధీనం చేసినట్లు చాగలమర్రి ఎస్ఐ రమణయ్య తెలిపారు. కంచి పట్టు చీరలకు సంబంధించిన పత్రాలను పరిశీలించి విచారణ చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

అటవీ సిబ్బంది, భక్తుల మధ్య వాగ్వాదం

నంద్యాల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అహోబిలంలో అటవీ సిబ్బందికి, భక్తులకు ఆదివారం వాగ్వాదం జరిగింది. కడప నుంచి వచ్చిన భక్తులు పావన నరసింహస్వామి క్షేత్రానికి వెళ్తుండగా అటవీ సిబ్బంది వాహనాలను నిలిపి ప్లాస్టిక్ వస్తువులు ఉండకూడదని వాహనాల్లోని వాటర్ ప్యాకెట్లు, ప్లేట్లు తీసుకొని వాహనాలకు రూ.2 వేలు గేట్ చెల్లించాలని చెప్పి కట్టించుకున్నారు. భక్తులు స్వామి దర్శనం చేసుకొని తిరిగి వచ్చి తమ దగ్గర నుంచి తీసుకున్న వాటర్ ప్యాకెట్లు, పేట్లు తిరిగి ఇవ్వాలని సిబ్బందిని కోరారు. వాటిని ఇవ్వమంటూ సిబ్బంది వాదనకు దిగారు. ఈ సమయంలోనే సిబ్బందికి, భక్తులకు ఘర్షణ చోటు చేసుకుంది. అనంతరం భక్తులు ఎగువ అహోబిలం దర్శనం చేసుకొని తిరిగి వస్తున్న భక్తులను ఫారెస్టు సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో భక్తులు ఆళ్లగడ్డ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫారెస్టు సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. ఫారెస్టు సిబ్బందికి, భక్తులకు మధ్య రాజీ చేసి పంపించామని రూరల్ ఎస్ఐ నరసింహులు చెప్పారు.

ఉపాధ్యాయులను నియమించాలి: ఎస్టీయూ

చాగలమర్రి, ఏప్రిల్ 28: రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి 210 ఉన్నత పాఠశాలలను ప్లస్‌టూ పాఠశాలలుగా ఉన్నతికరీంచారని, వాటికి పదోన్నతులపై ఉపాధ్యాయులను నియమించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం చాగలమర్రి గ్రామంలోని ఎస్టీయూ కార్యాలయంలో ఆ శాఖ అధ్యక్షుడు మస్తాన్‌వలి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిధి పోర్టల్‌లో పొందుపరచిన ఏపీజీఎల్ఐ సమాచారం పలు మార్పులు చేస్తున్నందున ధ్రువీకరణ కోసం గడువు పెంచాలని అన్నారు. మిస్సింగ్ క్రెడిట్ తదితర సవరణలను ఏపీజీఎల్ఐ కార్యాలయంలోనే సవరించుకునే విధంగా అవకాశం కల్పించాలన్నారు. ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్, మండల ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శులు సురేషప్ప, శేషాద్రి, శాస్త్రి రాజశేఖర్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీను, రీజనల్ కన్వీనర్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

రుద్రవరం, ఏప్రిల్ 28: మండలంలోని ఎరగుడిదిన్నె గ్రామానికి చెందిన గంగుల ప్రహ్లాదరెడ్డి శనివారం రాత్రి ఫోనులో తనను దూషించాడని గంగుల విజయసింహారెడ్డి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బండలాగుడు పోటీల్లో దువ్వూరి ఎద్దులు

బేతంచెర్ల, ఏప్రిల్ 28: పట్టణంలోని చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో ప్రథమ విజేతగా కడప జిల్లా దువ్వూరు ఎద్దులు నిలిచాయి. ఈ పోటీల్లో కడప జిల్లా దువ్వూరి మండలం దాసరిపల్లి గ్రామానికి చెందిన ములకల చిన్న వీరన్న యాదవ్ ఎద్దులకు ప్రథమ బహుమతి రూ.50వేలు, కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన సుధాకర్ ఎద్దులకు రెండో బహుమతి రూ.40 వేలు, నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం కోడూరు గ్రామానికి చెందిన చాగంటి మల్లికార్జున రెడ్డి ఎద్దులు మూడవ స్థానంలో నిలిచి రూ.30వేలు, సత్యసాయి జిల్లా సికేదన్నె మండలం పుల్లేటిపల్లి గ్రామానికి చెందిన బచ్చల భాస్కర్ రెడ్డి ఎద్దులకు నాల్గవ బహుమతి రూ.20వేలు, కర్నూలు జిల్లా రుద్రవరం గ్రామానికి చెందిన గోపాల్ గౌడు ఎద్దులు 5వ స్థానంలో నిలవగా.. రూ.10వేలు నగదు బహుమతులను కమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు.

ముగిసిన మారెమ్మ ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 28: మండలంలోని బెలుం గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న మారెమ్మ ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా వేద పండితుల మారెమ్మ, గంగమ్మ, సత్యమ్మ, నాభిశిల విగ్రహాలను భక్తజన సందోహం మధ్య ప్రతిష్ఠించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

టీడీపీని గెలిపించండి: అఖిలప్రియ

నంద్యాల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ ఆళ్లగడ్డ అసెంబ్లీ అభ్యర్థి భూమా అఖిలప్రియ కోరారు. ఆదివారం ఆళ్లగడ్డ మండలంలోని ఓబుళంపల్లె, యాదవాడ, మిట్టపల్లె గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు, టీడీపీ అధినేత చంద్రబాబు పేదల కోసం చేపట్టే సంక్షే పథకాలను వివరించారు. పింఛన్ నెలకు రూ.4 వేలను ఇంటి వద్దకే వచ్చి చెల్లిస్తారని, వలంటీర్లకు నెలకు రూ.10 వేలు ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఓబుళంపల్లెలో ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి అఖిలప్రియ

ఆళ్లగడ్డలో అభివృద్ధి ఎక్కడ?: అఖిలప్రియ

రుద్రవరం: ఆళ్లగడ్డలో ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి ఎక్కడ? అని ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ ప్రశ్నించారు. మండలంలోని చిత్తరేణిపల్లె, ఆలమూరు గ్రామాల్లో ఆదివారం ప్రజాగళం యాత్రలో ఆమె పాల్గొన్నారు. అఖిలప్రియ మాట్లా డుతూ బాలికపై అఘాయిత్యం చేసిన వ్యక్తిపై కేసు పెడితే డీఎస్పీ స్థాయి అధికారిని బదిలీ చేయించిన ఘనత ఆళ్లగడ్డ వైసీపీ నాయకులదేనని విమర్శించారు. పల్లెల్లో అభివృద్ధి జరిగిందంటే అది భూమా కుటుంబం కృషియేనన్నారు. జనసేన పార్టీ ఆళ్లగడ్డ ఇన్‌చార్జి రాంపుల్లారెడ్డి మాట్లాడుతూ నంద్యాల పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, ఆళ్లగడ్డ అసెంబ్లీ అభ్యర్థి భూమా అఖిలప్రియను గెలిపించాలని కోరారు. నారాయణ, సత్యనారాయణ, బ్రహ్మయ్య, మాజీ ఎంపీటీసీ ఖాదర్‌హుసేన్, రాజా, ప్రసాద్, సుబ్బారావు, సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరులో మాట్లాడుతున్న అఖిలప్రియ